క్లుప్తంగా

పీహెచ్‌సీని సందర్శించిన అధికారులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వరద నీరు రావడంతో జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో ఉన్న ముగ్గురు బాలింతలను గుడిహత్నూర్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కిరణ్‌కుమార్, సిబ్బందితో మాట్లాడారు. భారీవర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

అంబుగాం చెరువుకు గండి



అంబుగాం చెరువుకు పడిన గండి నుంచి వృథాగా పోతున్న నీరు

తాంసి: మండలంలోని అంబుగాం చెరువులోకి భారీగా వదర నీరు రావడంతో శనివారం చెరువు కట్టకు గండి పడింది. భారీగా వరదనీరు రావడంతో ఆయకట్టు పంటలు నీట మునిగాయి. గండిని డిప్యూటీ తహసీల్దార్ గణేశ్,ఆర్‌ఐ సంతోశ్ గ్రామస్తులతో కలిసి పరిశీలించారు.

పులిహోర ప్యాకెట్లు పంపిణీ



పంపిణీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్, తాటి గూడ కాలనీలో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. దీంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బాధితులకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్యాకెట్లు అందజేశారు.

ముగిసిన తీజ్ వేడుకలు



నృత్యం చేస్తున్న బంజారా నాయకులు

ఉట్నూర్‌రూరల్: తీజ్ వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. ఉట్నూర్ మండలంలో రాంనగర్‌లో తొమ్మిది రోజులుగా తీజ్ సంప్రదాయ పూజలు నిర్వహించిన గ్రామస్తులు సాయంత్రం ముగింపు వేడుకలను జరుపుకున్నారు. యువతులు చేసిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది.

బోథ్: సొనాల మండలంలోని సంపత్‌నాయక్ తండా గ్రామంలో తీజ్ పండుగను బంజారా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజులు బుట్టల్లో పెంచిన గోధుమ పైరుకు ప్రత్యేక పూజలు చేశారు. యువతులు ఉపవాసాలు ఉండి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గోధుమ పైరు బుట్టలను చెరువులో నిమజ్జనం చేశారు.

ప్రజలను ఆదుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: భారీ వర్షం ప్రభావంతో ఇబ్బందుల్లో ఉన్న ప్రజలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్నిచోట్ల కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయన్నారు. నిరాశ్రయులైన ప్రజలకు ధైర్యాన్నిస్తూ తక్షణ సాయం అందించాలన్నారు.

వీధిదీపాలు అందజేత



వీధిదీపాలు అందజేస్తున్న బాబాశ్యాం

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు శనివారం పులిమడుగు గ్రామంలో విధిదీపాలు అందించడం జరిగిందని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నాయకులు, సామాజిక సేవకులు బాబా శ్యాం అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నా.. గ్రామం కోసం ముందుకు వచ్చిన సేవ చేయడంపై గ్రామస్తులు అభినందించారు.



జైనథ్: నీట మునిగిన పంట పొలాలు



బోథ్: నీట మునిగిన పంట



భీంపూర్: పెన్‌గంగ వరద ఉధృతి

వర్ష బీభత్సం..

- జిల్లాలో భారీ వర్షం
- ఉప్పొంగిన వాగులు, వంకలు
- స్తంభించిన జనజీవనం



కైలాస్‌నగర్: పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్



నేరడిగొండ: ఉప్పొంగి ప్రవహిస్తున్న మాధాపూర్ వాగు

సాక్షి,నెట్‌వర్క్: జిల్లా కేంద్రంలోని పలు కాలనీలు చెరువును తలపించాయి. ప్రధాన చౌక్‌లు జలయమయం అయ్యాయి. కలెక్టర్, ఎస్పీలు వరద ప్రాంతాలకు చేరుకొని జేసీబీ యంత్రాలతో బయటికి మళ్లించేలా చర్యలు చేపట్టారు. డీఎస్పీ జీవన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు సహాయక చర్యలను పర్యవేక్షించారు.

బోథ్ మండలంలోని మర్లపల్లి వంతెన పూర్తిగా మునిగిపోయింది. దీంతో రకపోకలు నిలిచిపోయాయి. నక్కలవాడతో పాటు లక్ష్మీపూర్, కొత్తపల్లె, రేండ్లపల్లె గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. ధన్నూర్ (బి) వాగు పొంగి పొర్లింది.

- భీంపూర్ మండలంలోని అంతర్‌గామ సమీపంలోని పెనుగంగ ఉధృతంగా ప్రవహించింది. పత్తి, సోయా, తొగరి పంటలు నీట మునిగాయి.
- నేరడిగొండ లక్ష్మీపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు కోతకు గురైంది. సేవ్‌దాస్‌నగర్ వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. కడెం వాగు ఉధృతంగా ప్రవహించడంతో కుమారి, కుప్టి, తర్నం, వాగ్దారి, మాధాపూర్, కుంటాల పరివాహక ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి.
- తాంసి మండలంలోని ఆయా గ్రామాల వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. హస్నాపూర్ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. మత్తడివాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దాదాపుగా 60 ఎకరాల వరకు పంటలు నీటమునిగాయి.
- గాదిగూడ మండలంలోని ఖడ్కి, లోకారి-కే, దాబా గ్రామాల వద్ద ఉన్న కల్వర్టుపై నుంచి వరద ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. నార్నూర్ మండలంలోని మాన్కాపూర్ ప్రధాన రోడ్డు చెరువును తలపించింది. బారిక్‌రావుగూడ గ్రామస్తులకు బాహ్య ప్రపంచంతో సంబధాలు తెగిపోయాయి.
- ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని చిచ్‌ధరి, అంకోలి సమీపంలోని చించుఘాట్ గ్రామానికి వెళ్లే మార్గంలోని, బంగారుగూడ సమీపంలోని వంతెనలు కోతకు గురయ్యాయి. యాపల్‌గూడ మత్తడి చెరువు తెగి పోవడంతో పంటలు దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.



తాంసిలి కప్పర్ల బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరద



నార్నూర్: కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద



ఆదిలాబాద్‌రూరల్: కోతకు గురైన చించుఘాట్ వంతెన

ఉప్పొంగిన వాగులు



రుయ్యాడి సమీపంలో వాగు ఉధృతి

తలమడుగు: మండలంలో భారీ వర్షం కురిసింది. బరంపూర్, తలమడుగు, కొత్తూరు, సుంకిడి, ఖోడద్,లింగి, రుయ్యాడి, ఖోడద్, డోర్లి, బరంపూర్, ఝరి, కుచుల్లపూర్ గ్రామాల వాగులు ఉధృతంగా ప్రవహించాయి. కోడద్ హస్నాపూర్ గ్రామాల సమీపంలోని వాగు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

ఇళ్లల్లోకి వరద..



మాడగూడలో ఇళ్లల్లోకి వచ్చిన వరద

బజార్‌హత్నూర్: మండలంలో కురిసిన భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. బజార్‌హత్నూర్, దేగామ, సుంగుగూడ, రాంపూర్, జాతర్ల, జల్లుగూడ, చింతలసాంగ్వీ, మాడగూడ, ఇంద్రనగర్, భూతాయి, కొలారి కాండ్లీ గ్రామాల్లోని ఇళ్లల్లోకి వరదనీరు చేరింది. దేగామ బ్యాక్‌వాటర్ ఇళ్లల్లోకి చేరడంతో ధాన్యం, వస్తువులు, బట్టలు తడిచిపోయాయి.

కోతకు గురైన రోడ్డు..



రోడ్డును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ఇంద్రవెల్లి: మండలంలోని త్రివేణి సంఘం చెరువు అలుగు నీరు రోడ్డుపైకి రావడంతో ప్రధాన రహదారి కోతకు గురై రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌లు కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. మండల కేంద్రంలో వరదలో చిక్కుకున్న వారిని తాడు సాయంతో బయటకు తీసుకువచ్చారు.

పోటెత్తిన చిక్‌మాన్..



పొంగి పోర్లుతున్న చిక్‌మాన్ వాగు

సిరికొండ: మండలంలోని ప్రధాన చిక్‌మాన్ వాగు వరద నీటితో పోటెత్తింది. పరివాహక ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. రాంపూర్, సిరికొండల మధ్య రాకపోకలు స్తంభించాయి. నారాయణ్‌పూర్, తుమ్మల్‌పాడ్, ధర్మసాగర్ వాగులు ఉధృతంగా ప్రవహించాయి. ప్రభావిత ప్రాంతాలను అధికారులు పరిశీలించారు.

రంగంలోకి డీడీఆర్‌ఎఫ్ బృందాలు



సహాయక చర్యల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

గుడిహత్నూర్: మండలంలోని తోషం వద్ద కరీంనగర్ రహదారిపై ఉన్న వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. సీతాగోందిలో వాగు సమీపంలో ఉన్న ఫాంహౌస్ చుట్టూ వరద చేరడంతో కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లు వెంటనే అక్కడికి చేరుకొని డీడీఆర్‌ఎఫ్ బృందాలను రప్పించి ఆరుగురిని సురక్షింతగా బయటకు తీశారు.

ఇచ్చోడలో కుండపోత



నీటమునిగిన సూభాష్‌నగర్

ఇచ్చోడ: మండలంలో 123.02 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సూభాష్‌నగర్, విద్యనగర్, పాత ఎస్సీకాలనీల్లో వరద నీరు భారీ చేరింది. బాలికల ఆశ్రమ పాఠశాలలో వరద చేరడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాఠశాలకు చేరుకొని విద్యార్థులను మూడో అంతస్తులోకి పంపించారు. పెద్దగోదుమల్లె, ఎల్లమ్మగూడ, చిన్నగోదుమల్లె, బుర్సిగుట్ట, నేరడిగొండ(కే), జెండగూడ, గోండుఎల్లమ్మగూడ గ్రామాలకు రాక పోకలు నిలిచిపోయాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం కడెం నదీ పరివాహక ప్రాంతమైన కుప్టి వాగు ఉధృతంగా ప్రవహించడంతో అక్కడికి వెళ్లి పరిశీలించారు. కుమారి, కుప్టి, తర్నం గ్రామాల రైతులతో మాట్లాడారు. పంటలు వర్షపు నీటిలో మునిగాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, ఏలేటి రవీందర్ రెడ్డి, సురేందర్, గంగయ్య పాల్గొన్నారు.

వరద కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటన

బోథ్: మండలంలోని సాయినగర్ కాలనీని వరద ముంచెత్తింది. శనివారం కాలనీలో పలు ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. దీంతో నిత్యావసర సరుకులు తడిచిపోయాయి. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సాయినగర్ కాలనీలో పర్యటించి, ప్రజలకు ధైర్యం చెప్పారు. బాధితులను పరామర్శించి, ఆర్థిక సాయం చేశారు. కాలనీ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామన్నారు.



కుప్టి వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బాధితులకు పునరావాసం కల్పిస్తాం

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ చెరువు బ్యాక్‌వాటర్‌తో వరద ముంపుకు గురైన బాధితులకు పునరావాసం కల్పిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని తహసీల్దార్ శ్యాంసుందర్ అన్నారు. శనివారం మండలంలోని దేగామ, శంభుగూడ, జల్లుగూడ, మాడగూడ, చింతలసాంగ్వీ, మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోనేందుకు ప్రభుత్వానికి సమగ్ర రిపోర్టు పంపుతామన్నారు. ప్రభుత్వ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ జల్లుగూడలో బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఆర్‌ఐ నూర్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పరామర్శ

సిరికొండ: మండలంలో శనివారం కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటలు, ఇళ్లను కాంగ్రెస్‌బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పరిశీలించారు. బాధితులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు షేక్ ఇమామ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సాత్నాల ప్రాజెక్ట్‌ను సందర్శించిన జోగు రామన్న

సాత్నాల: భారీ వర్షాలకు సాత్నాల ప్రాజెక్టులో వరద నీరు భారీగా చేరింది. దీంతో అధికారులు నాలుగు గేట్లు ఎత్తి 45 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. శనివారం మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రాజెక్టును సందర్శించి, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వరద నీటితో పొలాలు దెబ్బతింటున్నాయని, అదనపు గేట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే సాత్నాల ప్రాజెక్టుపై దృష్టి సారించి 68 వేల క్యూసెక్కుల నీరును వదిలేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంద్రత్ రమేశ్, పెందుర్ దేవన్న, చరణ్, పోచ్చన్న, దత్తు, పోతన్న, భరత్ పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉండండి

కైలాస్‌నగర్: జిల్లాను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు వరద బాధితులకు అండగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పిలుపునిచ్చారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో వర్షపు నీటిలో చిక్కుకున్న బాధిత కుంటుంబాన్ని పరామర్శించారు. ఆపత్కాలంలో స్పందించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులను అభినందించారు. అనంతరం జై జవాన్‌నగర్, చిల్కూరిలక్ష్మినగర్, మహాలక్ష్మివాడలో పర్యటించి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ రాజర్షి షాతో ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను ముమ్మరం చేయాలని కోరారు. ఆయన వెంట దాసరి రమేశ్, సాజిదోద్దీన్, గంద్రత్ రమేశ్, వసంత్ ఉన్నారు.



ప్రాజెక్టు వద్ద జోగు రామన్న

ముకుందా.. ముకుందా..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయమే తమ చిన్నారులను తల్లిదండ్రులు అందంగా ముస్తాబు చేశారు,. కృష్ణుడి, రాధిక వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. కొన్ని గ్రామాల్లో పుట్ట మట్టితో శ్రీకృష్ణుని ప్రతిమను తయారు చేసి, ఇళ్లల్లో ప్రతిష్ఠించారు.



ఆదిలాబాద్: జన్మాష్టమి వేడుకల్లో బాలకేంద్రం చిన్నారులు



నేరడిగొండ: కొర్టికల్(బి)లో మట్టిని తీసుకొస్తున్న మహిళలు



గుడిహత్నూర్: ఉట్టీ కొడుతున్న యువకులు



ఉట్నూర్‌రూరల్: పూజలు చేస్తున్న ఏఎస్పీ కాజల్‌సింగ్

మహిళపై ఆవు దాడి

తాంసి: మండలంలోని పొన్నారి ఆలయానికి చెందిన ఆవు శనివారం సాయంత్రం శశికళ అనే మహిళపై దాడి చేసి గాయపరిచింది. గాయపర్చిన ఆవును శశికళ భర్త కత్తితో పొడిచి హతమర్చాడు. ఈ విషయమై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం గ్రామస్తులు ఆవుకు అంత్యక్రియలు నిర్వహించారు.

ఇంటర్వ్యూలకు ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు అతిథిగా ఉపాధ్యాయులకు ఈనెల 18న డెమో, ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, డీసీవో కీర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో వరద నీరు చేరిన విషయం తెలుసుకున్న కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ అక్కడికి చేరుకుని విద్యార్థులతో, సిబ్బందితో మాట్లాడారు. ప్రహరీ కూలిపోవడం కారణంగా వరద నీరు ఆవరణలోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రహరీ నిర్మాణం కోసం రూ.60 లక్షలు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. పరిస్థితి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమాచారం అందించాలని తహసీల్దార్ సత్యనారాయణరావును ఆదేశించారు.

వరద ప్రాంతాల పరిశీలన..

బేల: మండల కేంద్రంతో పాటు మాంగ్రుడ్, కరోని(బి), దహెగాం, సాంగిడి, ఎకోరి, తదతర వరద ప్రాంతాలను శనివారం మండల తహసీల్దార్ రఘునాథ్‌రావు పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. బేలలో వరద నీరు చేరిన ఇళ్లు, పంటలపై ఆరా తీశారు. నష్టంపై రెండు రోజుల్లోగా అంచనా వేసి, కలెక్టర్‌కు నివేదిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌రావు, ఆర్‌ఐ సాజిద్ ఉన్నారు.



వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్

జనజీవనం అస్తవ్యస్తం

ఉట్నూర్‌రూరల్: భారీ వర్షానికి శనివారం పూర్తిగా జనజీవనం స్తంభించింది. ఉట్నూర్, ఆదిలాబాద్ రహదారిపై ఉన్న వంతెనపై నుంచి వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. మండలంలోని నాగాపూర్ సమీపంలోని బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహించడంతో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పట్టణంలోని మోమీన్‌పుర, వేణునగర్, శాంతినగర్ కాలనీల్లో వరద నీరు చేరింది. ఐబీ ప్రాంతం జలమయంగా మారింది.



హోటల్‌లోకి చేరిన వరద